క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని నూతన కాలనీలకు విద్యుత్ సరఫరా కోసం చేస్తున్న మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) పండరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లాల్‌కమాన్, దోబిగల్లి, నెహ్రూ పార్క్, పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సాజీద్‌పుర, నర్సాపూర్, కేసీఆర్ డబుల్ బెడ్రూం కాలనీ, కరీంనగర్ రోడ్డు, లింగారెడ్డిపల్లి వడ్డెరకాలనీ, హనుమాన్‌నగర్, అంబేడ్కర్ చౌరస్తా, పారుపల్లివీధి, వీవీనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికే వాటర్ ప్లాంట్


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి గ్రామంలో బాలవికాస నీటి శుద్ధీకరణ పథకం వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి మారుమూల గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చడానికి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, నీరే మనిషికి ప్రాణాధారమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సన్మానం


సన్మానం పొందిన మహిళలతో పాలకవర్గం

చేర్యాల(సిద్దిపేట): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, ఆఫీస్ సిబ్బందిని పాలకవర్గం సభ్యులతో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, సందుల సురేష్, పచ్చిమడ్ల సతీష్, జుబేదాఖతూన్, తుమ్మలపల్లి లీల, ఉడుముల ఇన్నమ్మ, కో–ఆప్షన్ సభ్యులు జేబా బేగం, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు పోటీలు


ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేటజోన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు పోటీలు నిర్వహించారు. రంగవల్లి, వివిధ రకాల ఆటలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు పరిశీలించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మ్యూజికల్ చైర్స్, కోకో, దాండియా, ఆటలు, అదేవిధంగా తెలంగాణ మిల్లెట్ వంటకాలు, పోషణ విలువలతో కూడిన వంటకాలు ప్రదర్శన చేశారు. పోటీలను మెప్మా సీఓ రమ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధులు జ్యోతి, లావణ్య, శ్రీలత, మంగ, మమత, కృష్ణవేణి, పద్మ, శివచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సర్పంచ్ రమేశ్, గ్రామస్తులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల మహాలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 15 నుంచి 19 వరకు జరుగనున్నాయి. ఆదివారం గ్రామ దేవతలకు బోనాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన లేఖను అందించారు. అదేవిధంగా మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు కలిసి ఆహ్వానించారు.

కల్యాణలక్ష్మి నిరుపేదలకు వరం

ములుగు(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరంగా మారిందని ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. శనివారం ములుగులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 11మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు.

జాడలేని సబ్సిడీ గేదెలు

- ఐదేళ్ల క్రితం డీడీలు చెల్లింపు
- ఎదురుచూస్తున్న రైతులు
- ఆందోళనలో ఆరు గ్రామాల అన్నదాతలు



పాలకేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

కోహెడ(హుస్నాబాద్): సబ్సిడీ పాడి గేదెల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఐదేళ్ల క్రితం ప్రభుత్వానికి డీడీలు చెల్లించినా మంజూరులో జాప్యం జరుగుతోంది. పాడి గేదెల మంజూరుకు 5 ఏళ్లుగా కళ్ల కాయలు కాసేలా ఎదురు చూస్తున్నామని పాల ఉత్పత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 61 మంది..

- కరీంనగర్ డెయిరీ నిర్వహిస్తున్న పాల ఉత్పత్తిదారుల కేంద్రాల్లో మండల వ్యాప్తంగా 61 మంది పాడి రైతులు డీడీలు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.
- ఇందులో కోహెడ 31, వరికోలు 09, బస్వాపూర్ 10, ధర్మసాగర్‌పల్లి 06, నకెరకొమ్ముల 03, ఎర్రకుంటపల్లి 02 మంది రైతులు డీడీలు చెల్లించినట్లు తెలిసింది. 80వేలు యూనిట్‌లో బీసీ రైతులు రూ.40 వేలు, ఎస్సీ రైతులు రూ.20వేల చొప్పున డీడీలు అందజేశారు.

కొంత మందికి వాపస్

మొదటగా మండల వ్యాప్తంగా 121 మంది రైతులు డీడీలు చెల్లించినట్లు తెలిసింది. మంజూరు జాప్యంతో ఇప్పటికే 70 మంది రైతులు డీడీలను వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. మిగతా 61 మంది రైతులు సబ్సిడీ నిధుల మంజూరుకు ఎదురుచూస్తున్నారు. 61 మంది రైతులలో ఎస్సీ రైతులు సుమారు రూ.12లక్షల 20వేలు, బీసీ రైతులు 1లక్ష 20వేలు డీడీలు చెల్లించినట్లు తెలిసింది. ఇప్పటికైనా సబ్సిడీ డబ్బులు మంజూరు చేసి పాడి గేదెలను కొనుగోలు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లవుతోంది..



డీడీలు చెల్లించి ఐదేండ్లు దగ్గరకొస్తుంది. డబ్బులు మిత్తికి తెచ్చి గేదె కోసం డీడీ తీసి ఇచ్చినా. సార్లు త్వరగా గేదెల కొనుగోలుకు డబ్బులు మంజూరు చేసి ఆదుకోవాలి.
– రాగుల భాస్కర్, పాడి రైతు కోహెడ

31 మంది డీడీలు చెల్లించారు



కోహెడ పాల కేంద్రం నుంచి 31 మంది పాడి రైతులు సబ్సిడీ గేదెల కోసం డబ్బులు డీడీ ద్వారా చెల్లించారు. 2019 నుంచి సబ్సిడీ గేదెల కోసం ఎదురు చూస్తున్నారు. ఆలస్యం అయినా కొద్ది రైతులు తమను ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి సబ్సిడీ మంజూరు చేసి పాడి గేదెలను రైతులకు కొనుగోలు చేసి ఇవ్వాలి.
– ముంజ రాజేందర్‌గౌడ్, పాలకేంద్రం అధ్యక్షుడు, కోహెడ

త్వరలోనే పరిష్కారం

కరోనా నేపథ్యంలో ఆలస్యం అయింది. ఉన్నతాధికారుల సమచారం ప్రకారం రానున్న పది రోజుల్లో సమస్య పరిష్కారం కానుంది. ఇటీవల సబ్సిడీ గేదెల కొనుగోలు లబ్ధిదారుల లిస్టు జిల్లా అధికారుల నుంచి వచ్చింది. సబ్సిడీ డబ్బులు మంజూరు సిద్దిపేట జేడీ కార్యాలయంలో పెండింగ్ ఉంది. అధికారుల సూచనతో కొద్ది రోజుల్లోనే రైతులకు పాడి గేదలను కొనుగోలు చేస్తాం. –శ్రావణ్‌కుమార్, మండల పశువైద్యాధికారి, కోహెడ

చట్టాలపై అవగాహన ఉండాలి


దుబ్బాక: మాట్లాడుతున్న న్యాయమూర్తి సల్మా ఫాతిమా

దుబ్బాక: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని దుబ్బాక జూనియర్ సివిల్ న్యాయమూర్తి సల్మా ఫాతిమా అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలో దుబ్బాక కోర్టు ఆవరణలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో 'న్యాయపరమైన అవగాహన ద్వారా మహిళలకు సాధికారికత కల్పించడం' అనే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా రక్షణకు తీసుకోవాల్సిన ప్రత్యేక చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులపై మహిళలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై దాడులు జరిగినప్పుడు తప్పకుండా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, ఎస్సైలు మహేందర్, శ్రీధర్, గంగరాజు, న్యాయవాదులు, మెప్మా, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులున్నారు.

హుస్నాబాద్: మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ఎదుర్కోవాలంటే ముందుగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ సమావేశ మందిరంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. న్యాయవాదులు మహిళలకు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ రజిత హాజరై మాట్లాడారు. మహిళలు, అమ్మాయిలను మానసికంగా వేధిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. మహిళలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా షీటీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామకృష్ణ, లోక్ అదాలత్ సభ్యుడు చిత్తారి రవీందర్, ఎస్సై తోట మహేశ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, కొంకట నళినిదేవి, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, న్యాయవాదులు ఒగ్గొజు సదానందం, డికొండ ప్రవీణ్, శ్రీదేవి, సంధ్య, తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న ప్రతినిధులు

సిద్దిపేటజోన్: ముస్లింలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తహ్రీక్ ఏ ముస్లిం శబ్బన్ సంస్థ ప్రతినిధులు ముస్తాక్ మాలిక్‌ఖాన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, వెంటనే అమలు చేయాలని కోరారు. ముస్లింలను ఓటు బ్యాంక్ తరహాలో చూడొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అబ్దుల్, సయ్యద్, రసూల్ బాబా, సజ్జు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులు సంఘటితం కావాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): గీత కార్మికులు సంఘటితంగా ఏర్పడి సామాజికవర్గాన్ని అభివృద్ధి చేద్దామని ఫార్మర్స్ ఫస్టు ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దకోడూరులో 130 మంది గీత కార్మికులకు రూ.5లక్షల ప్రమాద బీమా బాండ్‌లను అందజేశారు. అలాగే విఠలాపూర్‌లో నిరుపేద వివాహానికి రూ.50వేల నగదు అందజేశారు. ఆయన వెంట సంస్థ డైరెక్టర్ అరోషికరెడ్డి, సభ్యులు ఉన్నారు.

మలబార్‌లో చైన్స్ ఫెస్టివల్

సిద్దిపేటజోన్: పట్టణంలోని మలబార్ గోల్డ్ డైమాండ్స్ షో రూమ్‌లో శనివారం చైన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 20 వరకు ఫెస్ట్ కొనసాగనుంది. ఈ సందర్భంగా వివిధ ఆకర్షణీయమైన చైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఫెస్ట్ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షో రూమ్ హెడ్ మహ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.


కేక్ కట్‌చేసి ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం


గజ్వేల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


గజ్వేల్‌రూరల్: లిక్కర్ దందాలో ఈడీ విచారణను ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను వెంటనే పదవి నుంచి తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలోని బీఆర్ఎస్ పాలనలో మహిళలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నా పట్టించుకోని ఆ పార్టీ నాయకులు లిక్కర్ దందాలో ఈడీ ఎదుట హాజరైన కవితకు మద్దతుగా నిలవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, బీఆర్ఎస్ నాయకుల వేదింపులే అధికంగా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు రాములు, మహేశ్, మనోహర్‌యాదవ్, అశోక్‌గౌడ్, శివకుమార్, విజయ్, సతీష్, నవీన్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్, సాయిగౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నాగపురిలో రక్తదాన శిబిరం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నల్లపోచమ్మ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నవీన్, నాగపురి గ్రామ క్రీడా కమిటీ అధ్యక్షుడు కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

◆ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహంకాళీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి స్వచ్ఛందంగా అన్నదాతగా నిలిచారు. భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని కోరారు. పేద ప్రజలకు సేవ చేయడానికి ఎప్పుడు ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవిరెడ్డి పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

చేర్యాల(సిద్దిపేట): సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల ఇన్‌చార్జి శివగారి అంజయ్య అన్నారు. శనివారం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కేంద్రానికి చెందిన పుట్ట నవనీత, నాగరాజు, వడ్డెర శివయ్యలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.88వేల విలువ గల 3 చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశాడు.

◆ ట్యాంకర్‌తో నీటి సరఫరా

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామానికి మిషన్ భగీరథ పథకం నీరు రావడం లేదు. దీంతో గ్రామ సర్పంచ్ కందూరి కనుకవ్వ ప్రజలకు నీటి ఇబ్బందులు ఎదురవకుండా గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా రోజుకు మూడు ట్యాంకర్ల మంచి నీటిని అందిస్తున్నారు. వేసవి కాలం దృష్ట్యా మిషన్ భగీరథ పథకంలో నీరు సరఫరా అయ్యేంత వరకు 10 వార్డులకు గాను రెండు వార్డులకు కలిపి ఒక ట్యాంకర్ నీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


పాక్షికంగా దెబ్బతిన్న జెండా గద్దెను పరిశీలిస్తున్న పోలీసులు, నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): వైఎస్సార్‌టీపీ జెండా గద్దెను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు కనకట్ల ఎల్లం డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌టీపీ జెండా గద్దెను గుర్తు తెలియని దుండగులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తులపై చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌టీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పాక్షికంగా దెబ్బ తిన్న జెండా గద్దెను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ ఎక్కడ బలపడుతుందోనన్న అక్కసుతోనే గుర్తు తెలియని దుండగులు పార్టీ జెండాను ధ్వంసం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల నాయకులు పయ్యావుల బాల్‌రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


మద్దూరులో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న సర్పంచ్ జనార్దన్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలో రెండు నెలలుగా తాగునీటి కటకట ఏర్పడిందని, దీంతో వాటర్ ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు తాగునీరు అందించాల్సి వస్తుందని మద్దూరు సర్పంచ్ కాంటారెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో ప్రజలకు వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో రెండు నెలలుగా భగీరథ నీరు సరిగా రాక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో మండల సభలో ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించకుండా మిషన్ భగీరథ అధికారులు కుంటి సాకులు చెబుతూ కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో వేసిన బోర్ల ద్వారా గ్రామానికి అరకొర వసతిగా నీటిని అందిస్తున్నారన్నారు. గ్రామంలోని ఆయా వార్డుల్లో బోరునీరు కూడా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో భగీరథ ద్వారా వేసిన పైప్‌లైన్ వరకు ప్రతి ఇంటికి నీరు అందేలా చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

మాయమాటలతో మోసం చేస్తున్న ప్రభుత్వాలు


సమస్యలను తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాయని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం మహ్మద్‌షాపూర్, ముత్యంపేట, గోవిందాపూర్ గ్రామాల్లో ఆత్మగౌరవ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ప్రభుత్వాల అవినీతి పాలన పేద ప్రజల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపేందుకే పాద యాత్రను చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

గృహ నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలి

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్, గంభీర్‌పూర్, రామక్కపేట, చౌదర్‌పల్లి, ఎనగుర్తి, రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట గ్రామాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత మంది పేదలు ఇళ్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం రూ.3లక్షలు కాకుండా 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ రైతుల రుణాలు మాఫీ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ఏక కాలంలో రైతుల రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, కమలాకర్, రాజిరెడ్డి, ఐలయ్య, శ్రీధర్‌రెడ్డి, బాబు, భాస్కర్, యాదగిరి, బాల్‌గౌడ్, రాములు, పర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సీతారామ ఉమామహేశ్వర ఆలయ పునర్నిర్మాణ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.6కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదటిరోజు సీతారామ ఉమామహేశ్వర ఆలయ ధర్మకర్తలు రుక్మాభట్ల కృష్ణమూర్తి, విశాల సాయికృష్ణశర్మ, దేశపతి రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు బీటుకూరి శ్రీనివాసాచార్యులు, మఠం శివకుమార్, నవీన్‌లతో పాటు చాడనందబాలశర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో వైష్ణవ, శైవ సంప్రదాయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఈవో శశిధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఏసీపీ రమేష్‌తో పాటు ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై నిరసన

బీఆర్ఎస్ నాయకుల ధర్నా
దిష్టిబొమ్మల దహనం


హుస్నాబాద్: బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితను కావాలని ఇరికించే కుట్రలు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్‌చైర్ పర్సన్ అనిత, ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య మంగ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఎంపీ బండి సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బెజ్జంకి పోలీస్ సేటషన్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, ఎరవెల్లి శ్రీనివాస్, మోహన్, నరేశ్, తిరుపతి, సంతోష్, శివ, రవి, రాములు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ఆమెకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వెంకట్రావుపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ.. బాధ్యాతాయుత పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేసి మహిళలను అవమానపర్చాడాన్నారు. ప్రధాని ఎన్నికుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటారని ఆయన తెలిపారు.

మిరుదొడ్డి(దుబ్బాక): బండి సంజయ్ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి ఆధ్వర్యంలో అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో శనివారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవవర్గ బీఆర్ఎస్‌వీ ఇన్‌చార్జి సురేష్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, కృష్ణ, ప్రశాంత్‌గౌడ్, చిరంజీవి, నాగరాజు, సురేశ్, సిద్ధిరాములు, స్వామి పాల్గొన్నారు.


దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెళ్లి ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, నాయకులు భూంరెడ్డి, పద్మయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, రాజు, పండు, రాజిరెడ్డి, పద్మయ్య, కౌన్సిలర్లు ఉన్నారు.


కోహెడ(హుస్నాబాద్): బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహేందర్, కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు, రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మణ్, నాగరాజు, రమేశ్, ఆంజనేయులు, వేల్పుల శంకర్, లింగారెడ్డి, కిషన్‌రెడ్డి, అశోక్, పరశురాములు పాల్గొన్నారు.


చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మహిళా నాయకులు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. చట్టాన్ని గౌరవించి ఈడీ ముందు విచారణకు హాజరైన ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సాయిరాం పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మర్కూక్‌లో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కవితపై కక్షకట్టి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కవితను అరెస్టు చేస్తే తెలంగాణ ప్రజానీకం తిరుగుబాటు తప్పదని చెప్పారు. సమావేశంలో సర్పంచ్ భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో..


సిద్దిపేటలో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు


దుబ్బాకలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు